క్లుప్తంగా

మడేలయ్య బోనాలు



బోనాలతో మహిళలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని రజకులు తమ ఆరాధ్యదైవమైన మడేలయ్యకు ఆదివారం బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ఇళ్ల నుంచి మహిళలు బోనమెత్తుకుని డప్పుచప్పుళ్లతో ప్రదర్శనగా మడేలయ్యస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి బోనాల మొక్కులు చెల్లించారు. రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

3న ఓడెడ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌లో 3న న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించనున్నట్లు న్యాయవాది శశిభూషణ్‌కాచే తెలిపారు. ఓడెడ్‌లో మంగళవారం ఉదయం జరిగే ఈ న్యాయ విజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి, న్యాయవాదులు హాజరవుతారని పేర్కొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సహృదయ్‌రావు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో తండ్రి పెర్కారి శ్రీధర్‌రావు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని కొడుకు హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం శ్రీధర్‌రావు జన్మదినం సందర్భంగా అతని కుమారుడు సహృదయ్‌రావు ఆరాధ్య బ్లడ్ సెంటర్‌లో రక్తదానం చేశాడు. 20ఏళ్లుగా తండ్రి శ్రీధర్‌రావు తన కుమారుడు సహృదయ్‌రావు జన్మదినం సందర్భంగా రక్తదానం చేస్తున్నాడు. అయితే తండ్రిని ఆదర్శంగా తీసుకున్న కుమారుడు తండ్రి జన్మదినం సందర్భంగా రక్తదానం చేశారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఓదెల: మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రూపునారాయణపేట మానేరులో వంతెన నిర్మాణానికి రూ.80కోట్లు, ఓదెల నుంచి పెగడపల్లి వయా ఓదెల మల్లన్న గుడి వరకు రూ.13కోట్లతో రోడ్డు నిర్మాణం, రూ.90లక్షలతో ఓదెల గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి నిధులను ఎమ్మెల్యే మంజూరు చేసినట్లు పార్టీ అధ్యక్షుడు పేర్కొన్నారు. రంగుల దుకాణం నుంచి స్టేషన్‌వరకు ర్యాలీ తీశారు. అనంతరం నాయకులు క్షీరాభిషేకం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిశెటి రాహుల్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీకట్ల మొండయ్య, ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచు ఆకుల మహేందర్, మాజీ ఎంపీటీసీ శంకర్ పాల్గొన్నారు.

మంథని-జమ్మికుంట బస్సు పునః ప్రారంభం

మంథని: మంథని- జమ్మికుంట బస్సు సర్వీస్ తిరిగి ప్రారంభమైనట్లు డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంథని నుంచి ఉదయం 6.15 గంటలకు, మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరి ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట మీదుగా హుజూరాబాద్ వరకు వెళ్తుందన్నారు. అలాగే హుజూరాబాద్ నుంచి మొదటి ట్రిప్పు ఉదయం 10 గంటలకు, రెండో ట్రిప్పు సాయంత్రం 5.40గంటలకు బయలు దేరుతుందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

రామగిరి: మండలంలోని బేగంపేటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం బేగంపేటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2310 నగదు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డుపై నిలుస్తున్న మురుగు



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని ఎన్టీపీసీ ప్రభావిత గ్రామం ఖాజీపల్లిలో సైడ్ డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. రోడ్డుపై నడవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సైడ్ డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అలంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో వీధి దీపాలు నిర్మాణ పనులు పూర్తయి మూడు నెలలైనా వెలగడం లేదు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జనావాసాల మధ్య నిలుస్తున్న మురుగు



జ్యోతినగర్: జనావాసాల మధ్య ఉన్న మురుగునీటి గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలో రోడ్డు సరిగ్గా లేకపోవడం, సైడ్ కాలువలు కట్టకపోవడంతో మురుగునీరంతా నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రామగుండం కార్పొరేషన్ సంబంధిత విభాగం వారు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కాల్వశ్రీరాంపూర్: 1996-97 బ్యాచ్..



యైటింక్లయిన్‌కాలనీ: 2006-07 బ్యాచ్



యైటింక్లయిన్‌కాలనీ: 2007-08 బ్యాచ్



గోదావరిఖనిటౌన్: 2003-04 బ్యాచ్..



గోదావరిఖనిటౌన్: 1999-2000 బ్యాచ్..



గోదావరిఖనిటౌన్: రాజరాజేశ్వర హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కప్పి సన్మానించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న 2006-07 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే స్థానిక స్పందన మోడల్ స్కూల్‌కు చెందిన 2007-08 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు కమ్యూనిటీ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక గీతాంజలి పాఠశాలలో చదివిన 2003-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక మార్కండేయకాలనీ దుర్గానగర్‌లోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కంది రవీందర్‌రెడ్డిని సత్కరించారు.

స్థానిక వాణీవిద్యావిహార్ పాఠశాలలో 1999-2000లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక అడ్డగుంటపల్లిలోని ఎస్ఎస్ బాంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. స్థానిక రాజరాజేశ్వర హైస్కూల్‌లో 1999-2000లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక అమృతరాజ్ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.



జూలపల్లి: ఆలయ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం

జూలపల్లి: జూలపల్లి ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో 1993-94లో పదో తరగతి కలిసి చదువుకున్న మిత్రులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మినర్సింహస్వామి ఆలయ ఆవరణలో మిత్రులు కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



జూలపల్లి ఆరోగ్య కేంద్రంలో యోగాసనాలు



ఓదెల: శిక్షణ ఇస్తున్న ఆయుర్వేద డాక్టర్ ప్రభాకర్

గర్భిణులకు శిక్షణ

జూలపల్లి: యోగాతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటామని, ప్రతీరోజు యోగా చేయాలని యోగా శిక్షకురాలు సుజాత అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి, రోగులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్‌రెడ్డి, యునానీ వైద్యాధికారి అబ్దుల్ రఫే, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆయుర్వేద డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఆధ్వర్యంలో గర్భిణులకు శిక్షణ ఇచ్చారు. నిత్యజీవితంలో యోగా, ప్రాణాయామం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఫార్మసిస్టులు బి.సుధాకర్, లక్ష్మణ్, సిబ్బంది సీహెచ్.రాజమల్లు, యోగా శిక్షకులు అవినాష్ ఉన్నారు.

చెరువు మట్టి తరలించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామంలో చెరువు మట్టి తలరించొద్దని గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలించడంతో సారవంతమైన మట్టి రైతులకు అందకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు, లారీలతో రోడ్డు ధ్వంసం అవుతోందన్నారు. వాహనాలతో దుమ్ము లేచి ఇళ్లపై, ఇంట్లోని దుస్తులపై పేరుకుపోయి దురదతో ఒళ్లు పుండ్లు అవుతున్నాయని వాపోయారు. వృద్ధులు, చిన్నారులు శ్వాస సంబంధ వ్యాధులకు గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్సై వెంకటేశ్ చెరువు వద్దకు వెళ్లి అనుమతులు ఉన్నాయని, దుమ్ము లేవకుండా నీటిని రోడ్డుపై చల్లించే ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

అంబేడ్కర్ సేవ యువజన సంఘం అధ్యక్షుడిగా కనకయ్య

సుల్తానాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో అంబేడ్కర్ సేవ యువజన సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా తిప్పారపు దయాకర్, అధ్యక్షుడు ఆసంపల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు క్యాదాసి శంకరయ్య, కలువల లక్ష్మణ్, న్యాతరి రాజేందర్, రుద్రారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి భుష్పాక సుమన్, కార్యవర్గ సభ్యులు కలువల నర్సయ్య, బట్టు సాయి, రుద్రారపు హరీశ్, కల్లెపెల్లి ఆకాశ్ ఎన్నుకున్నారు. దయాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతీఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పల్లె శ్రీనివాస్, న్యాతరి మహేందర్, చిలుక రాజేశం, క్యాదాసి పోచయ్య పాల్గొన్నారు.

స్వరాష్ట్రాలకు తరలుతున్న ఇటుకబట్టీ కార్మికులు



రైల్వేస్టేషన్‌లో ఒడిశా కూలీలు

రామగుండం: వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇటుక బట్టీల నిర్వహణ పనులకు అన్‌సీజన్ ఏర్పడింది. దీంతో ఒడిశాకు చెందిన వందలాది మంది కార్మికులు రైళ్లలో తమ స్వరాష్ట్రాలకు తరలివెళ్లేందుకు రామగుండం రైల్వేస్టేషన్‌కు లారీల్లో చేరుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, ధర్మారం, ధర్మపురి, సుల్తానాబాద్, గర్రెపల్లి తదితర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఇంటిబాట పట్టారు. దీంతో రామగుండం రైల్వేస్టేషన్ పరిసరాలు కూలీలతో సందడి మారాయి.

ప్రమాదకరంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెట్టుకొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్ ప్రధాన రహదారిలో ఓ చెట్టు ప్రమాదకరంగా ఉండడంతో శనివారం 'జర భద్రం.. చెట్టుకూలిపోయేలా ఉంది' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ స్పందించారు. కమిషనర్ ఆదేశాలలో రోడ్డుకు అడ్డంకిగా మారిన చెట్టుకొమ్మలను ఆదివారం తొలగించారు. స్థానికులు 'సాక్షి'ని అభినందించారు.

సంక్షిప్త వార్తలు

• నేత్రదాత కుటుంబానికి ప్రశంసాపత్రం

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన పులిపాక మొండయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఆదివారం మొండయ్య ఇంటి వద్ద సంస్మరణ సభ నిర్వహించి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులకు ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, కుందారపు బాపు, పులిపాక రాయలింగు, కేసు వాసు, లింగమూర్తి, బానయ్య ఉన్నారు.

• విద్యుత్ షాక్‌తో గేదె మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటేశం అనే రైతుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. మృతి చెందిన గేదెను తొలగించిన అనంతరం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పల్లెలోని ఇంటింటి నుంచి మహిళలు పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లారు. బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



గోదావరిఖని: జూలపల్లి మండల కేంద్రం నుంచి కాచాపూర్ వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జూలపల్లి బస్టాండ్ నుంచి పెట్రోల్‌బంక్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ కోసం తవ్వి మట్టి పోయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో అకస్మాత్తుగా వాహనం ఎదురుగా వస్తే అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపక్కన తవ్విన ప్రాంతాల్లో వెంటనే మట్టిపోయి విస్తరణ జరపాలని జూలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్ కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణిలో వైద్య నిపుణులను నియమించాలి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులను నియమించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. నిపుణులైన వైద్యులు అందుబాటులోలేకపోవడంతో ప్రైవేట్ హాస్పిటళ్లలో చికిత్స పొందుతూ ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. వైద్యం కోసం వచ్చిన వారికి సరైన మందులు ఇవ్వడం లేదన్నారు. రూ.30వేల కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థ తన ఉద్యోగుల కోసం అన్ని సౌకర్యాలు కలిగిన హాస్పిటల్‌ను నిర్మించక పోవడం బాధాకరమన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 4న కొత్తగూడెం హెడాఫీస్ ఎదుట దీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, పర్లపెల్లి రవి, వడ్డేపల్లి శంకర్, ఎల్.వెంకటేశ్, పింగిళి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే



నర్సింహారావు



బుర్ర రమేశ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో ఇద్దరు ఉత్తమ ఉద్యోగులను యాజమాన్యం ఎంపిక చేసింది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా వీరిని సన్మానించనున్నారు. ఉత్తమ అధికారిగా ఏరియా ఇంజినీర్ ఎం.నరసింహరావును కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే వేడుకల్లో సంస్థ సీఅండ్ఎండీ చేతుల మీదుగా సన్మానించనున్నారు. అలాగే ఓసీపీ-3 సీహెచ్‌పీ ఫిట్టర్ బుర్ర రమేశ్‌ను ఏరియా ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేశారు. సోమవారం ఆర్జీ-2 ఏరియా సీఈఆర్‌క్లబ్‌లో జరిగే వేడుకల్లో జీఎం వెంకటయ్య సన్మానించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

'చలో కొత్తగూడెం' ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణివ్యాప్తంగా సులభ్ కాంప్లెక్సుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ హక్కులు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యైటింక్లయిన్‌కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సులభ్ కార్మికులకు ఉచితంగా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి సులభ్ కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 5న చేపట్టిన ధర్నాలో అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వెంకన్న, నరేశ్, అశోక్, రాజేశం, శారద, పద్మ, లింగయ్య, రాయమల్లు, మధునయ్య, సరోజన, కళమ్మ, పోచం, చంద్రన్న, సమ్మక్క, లక్ష్మీతో పాటు తదితరులు పాల్గొన్నారు.